ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
శుక్రవారం
10 అక్టోబర్ 2025

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచి మోదీకి గిఫ్ట్ ఇస్తాం : భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు

హైదరాబాద్, అక్టోబర్ 10, (రిపబ్లిక్ న్యూస్): బీసీలను భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ మోసం చేశాయని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్రావు విమర్శించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గ్రేటర్ పరిధి జిల్లాల సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపాతోనే బీసీలకు న్యాయం జరుగుతుందనే నిర్ణయానికి ప్రజలు కూడా వచ్చారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందని చెప్పారు. "నగరాన్ని ప్రపంచానికే తలమానికంగా మారుస్తామని భారత రాష్ట్ర సమితి గతంలో చెప్పింది.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు పడలేదు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చింది. ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగాయి. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తాం. ఈ ఉప ఎన్నికలో గెలిచి ప్రధాని మోదీకి గిఫ్ట్ ఇవ్వాలి. రేపటి నుంచి కార్యకర్తలు, నేతలు జూబ్లీహిల్స్ లో ప్రచారం చేయాలి. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందాన్ని తిప్పికొట్టాలి" అని రామచందర్రావు కోరారు.

బీసీ బాలుర వసతిగృహంలో 47 మంది విద్యార్థులకు అస్వస్థత

పెదనందిపాడు, అక్టోబర్ 10, (రిపబ్లిక్ న్యూస్): గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలోని అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో శుక్రవారం 47 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలు కావడంతో వారిని స్థానిక పీహెచ్సీకి తరలించారు.

వైద్యుడు సిబ్బందితో కలిసి విద్యార్థులకు చికిత్సను అందిస్తున్నారు. ఈ వసతి గృహంలో 106 మంది విద్యార్థులు ఉండగా, వీరిలో కొందరు జ్వరంతో బాధపడుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ హేనా ప్రియ, డీటీ కరిముల్లా, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అక్కడి సేవలను పర్యవేక్షిస్తున్నారు. ఐదుగురు విద్యార్థులకు జ్వరం తీవ్రంగా ఉండటంతో వారిని గుంటూరు జీజీహెచ్కు తరలించారు. అన్నపర్రు బీసీ బాలుర హాస్టల్ను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే రామాంజనేయులు సందర్శించారు. అక్కడి విద్యార్థుల పరిస్థితులను ఆరా తీశారు. హాస్టల్ వార్డెన్పై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

దగ్గు మందు వివాదం..
సీబీఐ విచారణ పిటిషన్ ను కొట్టేసిన 'సుప్రీం'

అక్టోబర్ 10, (రిపబ్లిక్ న్యూస్):కోల్డ్' దగ్గుమందు కారణంగా మధ్యప్రదేశ్లో పలువురు పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి సీబీఐ విచారణ, ఔషధ భద్రతా విధానాలలో వ్యవస్థాగత సంస్కరణలను కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది.

ఈ పిల్ పై తక్షణమే విచారణ జరపాల్సి ఉందని పిటిషనర్, న్యాయవాది విశాల్ తివారి కోరడంతో విచారణ జరపడానికి గురువారం న్యాయస్థానం అంగీకరించింది. అనంతరం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ పిటిషన్పై అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రస్తుతం తాను ఏ రాష్ట్రం తరపున వాదించడం లేదని.. అయితే ఈ విషయంలో తమిళనాడు, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యల తీవ్రతను తగ్గించలేమని మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. ఇటువంటి వాటిపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్రాల్లో పలు చట్టపరమైన యంత్రాంగాలు ఉన్నాయని.. ఇందుకు సీబీఐ అవసరం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ కె వినోద్ చంద్రన్లతో కూడిన ధర్మాసనం న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిల్ను తోసిపుచ్చింది. 'కోల్డ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్లో చాలామంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. చిన్నారుల మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్లో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్నారు. ఈక్రమంలో ఆ కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

ఇలాంటి కుంభకోణాన్ని నా సర్వీసులో చూడలేదు..
మోహిత్ రెడ్డి కేసులో ముకుల్ రోహత్గా వాదనలు

దిల్లీ, అక్టోబర్ 10, (రిపబ్లిక్ న్యూస్): వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో వైకాపా నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ పై జస్టిస్ విక్రమ్నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట నేడు విచారణ జరిగింది. కేవలం తన పేరుతో ఉన్న కారులో డబ్బులు పట్టుబడ్డాయనే కారణంతో కేసు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తున్నారని మోహిత్రెడ్డి తరపు న్యాయవాది కోర్టుకు చెప్పారు.

ఇదే కేసులో ఆయన తండ్రి జైలులో ఉన్నారని.. మోహిత్రెడ్డిని కూడా అరెస్ట్ చేయాలని చూస్తున్నారన్నారు. మోహిత్రెడ్డి న్యాయవాది వాదనలను ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గ ఖండించారు. కారు పట్టుకున్నందుకు కాదని.. అందులో డబ్బు కట్టలను అక్రమంగా తరలిస్తున్నందుకు కేసు నమోదు చేశారన్నారు."ఎన్నికల సమయంలో మోహిత్రెడ్డిపై ఈ కేసు పెట్టారు. ఆయన తండ్రి రాజకీయ నేత. మోహిత్ రెడ్డి కూడా ఎన్నికల్లో పోటీ చేశారు. ఇది మద్యం కుంభకోణానికి సంబంధించిన వ్యవహారం. అక్కడ కిక్ బ్యాగ్స్ రూపంలో తీసుకున్న డబ్బులు ఎన్నికల్లో ఖర్చు చేయడానికి తరలించారు. ఇలాంటి కుంభకోణాన్ని నా సర్వీసులో ఎప్పుడూ చూడలేదు. సుమారు రూ.3,500 కోట్ల కుంభకోణం కేసు దర్యాప్తులో అనేక విషయాలు వెలుగుచూస్తున్నాయి. మద్యం విధానంలో మార్పులు చేశారు. ప్రముఖ కంపెనీల పేరున్న బ్రాండ్స్ అన్నీ తీసేసి.. ఊరూ పేరు లేని బ్రాండ్స్ తీసుకువచ్చారు. మద్యం విధానం ద్వారా దాదాపు 100 రెట్లకు పైగా నిధులు సమకూర్చుకున్నారు. వాటినే ఎన్నికల్లో ఖర్చుకు తీసుకువచ్చారు" అని ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తన వాదనలన్నీ కౌంటర్లో చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలంటూ నోటీసులు జారీ చేసింది. అప్పటివరకు మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత తదుపరి విచారణ చేపడతామని తెలిపింది.

రిపబ్లిక్ సినిమా CINEMA

రాజమౌళి బర్త్ డే.. స్పెషల్ ఫొటోతో మహేశ్ విషెస్

టాలీవుడ్కు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన దర్శకుడు.. ఆర్ఆర్ఆర్తో తెలుగు చలనచిత్ర పరిశ్రమను అంతర్జాతీయంగా అందలం ఎక్కించిన దర్శక ధీరుడు రాజమౌళి. నేడు ఈ జక్కన్న పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు ఒక స్పెషల్ ఫొటోతో విషెస్ చెప్పారు. రాజమౌళితో దిగిన ఫొటో పంచుకున్న మహేశ్.. "ఇండస్ట్రీలో ఉన్న ఒకేఒక్క దర్శకధీరుడు రాజమౌళికి పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు తెరకెక్కించేవన్నీ అద్భుతాలే. మీ నుంచి మరో అద్భుతం త్వరలోనే రానుంది" అని రాసుకొచ్చారు. అందులో మహేశ్ ఎస్ఎస్ఎంబి29 లుక్లో ఉండడంతో ఈ ఫొటో వైరల్ అవుతోంది. -ప్రస్తుతం మహేశ్ - రాజమౌళిల కాంబినేషన్లో ఎస్ఎస్ఎంబి29 తెరకెక్కుతోంది. భారీస్థాయిలో రానున్న ఈ ప్రాజెక్టు 'వారణాసి' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. నవంబర్ 16న దీన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. ఇందులో మహేశ్ సరసన ప్రియాంకచోప్రా కథనాయికగా నటించనున్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

విండీస్తో రెండో టెస్టు.. తొలి రోజు లంచ్ బ్రేక్కు భారత్ స్కోరు 94/1

వెస్టిండీస్తో రెండో టెస్టులో తొలి రోజు మొదటి సెషన్ ముగిసింది. భారత బ్యాటర్లు ఆచితూచి ఆడారు. లంచ్ బ్రేక్ సమయానికి టీమ్ ఇండియా 28 ఓవర్లలో వికెట్ నష్టానికి 94 పరుగులు చేసింది. క్రీజ్లో యశస్వి జైస్వాల్ (40బి), సాయి సుదర్శన్ (16బి) ఉన్నారు. వీరిద్దరూ రెండో వికెట్కు 36 పరుగులు జోడించారు. అంతకుముందు మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (38)ను వారికన్ ఔట్ చేశాడు. విండీస్ బౌలర్ వేసిన బంతిని ముందుకొచ్చి ఆడబోయిన కేఎల్ స్టంపౌట్ రూపంలో పెవిలియన్కు చేరాడు. దీంతో యశస్వితో కలిసి మొదటి వికెట్ నిర్మించిన 58 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం యశస్వి - సాయి మరో వికెట్ ఇవ్వకుండా సెషన్ ను ముగించారు.

తొలి సెషన్ నుంచే..

దిల్లీ పిచ్ సాధారణంగా బ్యాటింగ్కు అనుకూలం. రోజులు గడిచే కొద్దీ స్పిన్కు అనుకూలంగా మారుతుంది. తొలి గంటలో పిచ్పై తేమ ఉండటంతో పేస్ బౌలర్లకు లాభిస్తుంటుంది. ఇప్పుడు కూడా అలాగే మొదలైనప్పటికీ.. స్పిన్నర్లకూ సహకరించడం గమనార్హం. విండీస్ సీమర్లు జైడెన్ సీలెస్, అండర్సన్ ఫిలిప్ కట్టుదిట్టంగా బంతులేయడంతో భారత ఓపెనర్లు యశస్వి - కేఎల్ ఆచితూచి ఆడారు. ఎప్పుడూ దూకుడుగా ఆడే యశస్వి కూడా నెమ్మదిగా ఆడాడంటే పేసు ఎంత బాగా సహకరించిందో అర్థం చేసుకోవచ్చు. తొలి సెషన్ లో 28 ఓవర్ల ఆట జరగగా.. ముగ్గురు సీమర్లు కలిసి 15 ఓవర్లు వేశారు. స్పిన్కు అనుకూలంగా మారుతుందని భావించిన విండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ మొదట వారికన్ను బరిలోకి దింపాడు. వెంటనే ఫలితం విండీస్కు అనుకూలంగా వచ్చింది. అద్భుతంగా స్పిన్ అయిన బంతిని అంచనా వేయడంలో పొరపాటుపడ్డ కేఎల్ ఔటయ్యాడు. అయితే, ఆ తర్వాత కూడా స్పిన్నర్లు భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నించారు. కానీ, యశస్వి-సుదర్శన్ ద్వయం మాత్రం ఏమాత్రం కంగారు పడకుండా సెషన్ ను ముగించారు. మున్ముందు సెషన్లలోనూ స్పిన్కు అనుకూలంగా మారడం ఖాయం.

అప్పుడప్పుడు వేరుశనగ నూనె వాడితే గుండె ఆరోగ్యంతో పాటు
ఈ లాభాలు కూడా, మితంగానే తీసుకోవాలి సుమా

ఆరోగ్యం

పల్లీల నూనె.. పల్లీల నుంచి తయారుచేస్తారు. సాధారణంగా ఈ నూనెని బేకింగ్, సాటింగ్, ఫ్రైయింగ్ వంటి వంటల్లో వాడతారు. దీనిని తినడం వల్ల ఎలాంటి లాభాలు ఉన్నాయో తెలుసుకోండి.

మిగతా నూనెలతో పోలిస్తే పల్లీ నూనె కొద్దిగా రుచి వేరుగా ఉంటుంది. ఈ నూనెతో కొన్ని వంటలు చేయడం చాలా మంచిది. ఈ నూనెలో ఎక్కువగా విటమిన్ ఇ ఉంటుంది. ఇది మంచి యాంటీ ఆక్సిడెంట్. ఇందులో ఎక్కువగా హెల్దీ ఫ్యాట్స్ ఉంటాయి. వీటితో పాటు కేలరీలు, ఫ్యాట్, శాచ్యురేటెడ్ ఫ్యాట్, విటమిన్ ఈ, మోనో శాచ్యురేటెడ్ ఫ్యాట్, పాలీ అన్శాచ్యురేటెడ్ ఫ్యాట్, ఫైటోస్టెరాల్స్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఈ నూనెని మితంగా తీసుకోవడం వల్ల చాలా లాభాలున్నాయి. అవేంటంటే..

కొలెస్ట్రాల్ని తగ్గించడం



వేరుశనగన నూనెలోని మోనోఅన్శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ మీ బాడీలో చెడు కొలెస్ట్రాల్ని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ఈ చెడు కొలెస్ట్రాల్ని ధమనులని అడ్డుకుంటుంది. గుండె జబ్బులు, స్ట్రోక్కి కారణమవుతుంది.

డయాబెటిస్ కంట్రోల్కి

కొన్ని అధ్యయనాల ప్రకారం, ఈ నూనె తీసుకోవడం వల్ల సంతృప్త కొవ్వులకి బదులుగా పాలీ అన్శాచ్యురేటెడ్ కొవ్వులని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ స్రావం కూడా మెరుగ్గా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్లో ఉంచుతుంది.

బ్రెయిన్ హెల్త్

వేరుశనగ నూనెలో మంచి ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి బ్రెయిన్ హెల్త్కి చాలా మంచిది. వయసు పెరిగేకొద్దీ వచ్చే అనేక సమస్యల్ని ఈ వేరుశనగ నూనె దూరం చేస్తుంది. ఈ నూనెని తీసుకోవడం వల్ల బ్రెయిన్ సెల్స్ టాక్సిన్స్, ఆక్సిడేటివ్ స్ట్రెస్ వంటి డ్యామేజ్ నుంచి కాకుండా ఉంటాయి. దీంతో పాటు అల్జీమర్స్ వంటి సమస్యల్ని కూడా తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యం



పల్లీ నూనెలో ఎక్కువగా విటమిన్ ఇ, మోనోశాచ్యురేటెడ్, పాలీ అన్శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవన్నీ గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. అధ్యయనాల ప్రకారం, ఈ పల్లీ నూనె తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మరో అధ్యయనం ప్రకారం, ఈ నూనెలో ఎక్కువగా విటమిన్ ఇ ఉంటుంది. ఇది బాడీని ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడుతుంది. దీని వల్ల సెల్స్ డ్యామేజ్ కాకుండా ఉంటాయి. క్యాన్సర్స్, గుండె సమస్యలు రాకుండా ఉంటాయి.

స్కిన్ ప్రాబ్లమ్స్

పల్లీ నూనెలో ఎక్కువగా విటమిన్ ఇ ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల స్కిన్ ఎలాస్టిసిటీ పెరుగుతుంది. దీని వల్ల గాయాలు త్వరగా తగ్గుతాయి. ఈ నూనెలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. దీనిని తీసుకోవడం వల్ల ఎగ్జిమా, సోరియాసిస్ వంటి సమస్యలు తగ్గుతాయి. ఇందులో ఫ్యాటీ యాసిడ్ ఉంటాయి. ఇవి స్కిన్కి చాలా మంచిది. ఇది స్కిన్ని హైడ్రేట్గా చేస్తుంది.

సైడ్ ఎఫెక్ట్స్

పల్లీ నూనె మంచిదే అయినప్పటికీ దీనిని తీసుకోవడం వల్ల కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. అవి ఏంటంటే.. కొంతమందికి ఈ నూనె పడదు. అలర్జీలు వస్తుంటాయి. ముఖ్యంగా పిల్లల్లో. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ముడి, కోల్డ్ ప్రెస్డ్తో పోలిస్తే ప్రాసెస్డ్ పల్లీ నూనె కాస్తా బెటర్. అయినప్పటికీ, ఏదైనా సమస్య అనిపిస్తే దీనిని తీసుకోవద్దు. అదే విధంగా, వేరు శనగ నూనెలో ఎక్కువగా ఒమేగా 6 ఫ్యాట్స్ ఉంటాయి. ఈ నూనెని తీసుకోవడం వల్ల గుండె సమస్యలు పెరిగే అవకాశం ఉంది. అందుకే, మితంగా తీసుకోవాలి.గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.